
www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 16 | మార్చి | 2026 పేజీలు : 7

## లాభదాయక పంటలవైపు రైతులు దృష్టి సారించాలి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

2 లో



# పార్టీ కార్యాలయాలు..ఉద్యమ కేంద్రాలు



-ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు
-తూము ప్రకాశరావు చిరస్మరణీయుడు : కూనంనేని
-సిపిఐ బోనకల్ మండల కార్యాలయం ప్రారంభం


**ప్రజాపక్షం/ఖమ్మం :** కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాలు ఉద్యమ కేంద్రాలుగా భాసిల్లాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. ప్రజల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలకు ప్రణాళిక రూపొందించుకోవాలని ఆయన తెలిపారు. బోనకల్ మండల సిపిఐ కార్యాలయం తూము ప్రకాశరావు భవన్‌ను కూనంనేని సాంబశివరావు ఆదివారం ప్రారంభించారు. మీటింగ్ హాల్‌ను సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, కార్యదర్శి చాంబర్‌ను దండి సురేష్ ప్రారంభించగా కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని

మిగతా 2లో..



# రైతు భరోసా ఇవ్వండి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రెండు లక్షల రూపాయల పైన ఉన్న వారు బాకీ చెల్లిస్తే రెండు లక్షల రుణమాఫి చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క తక్షణమే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం కొణిజర్లలో ఆదివారం టి సోమయ్య అధ్యక్షతన జరిగిన రైతుసంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి రైతుల పంటల రుణం తీర్చాలని అమె అన్నారు. రైతులు పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధర 2400 చొప్పున కొనుగోలు చేయాలని తెలిపారు. కేంద్రంలో బిజెపి నరేంద్రమోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి భారతదేశ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేందుకు కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తు ఇతర దేశాల వాణిజ్య పంటలకు ఎలాంటి సుంకాలు లేకుండా దిగుమతులకు అనుమతులు ఇస్తు మన పంటలను కొనుగోలు చేసే దిక్కులేకుండా నరేంద్రమోడి పరిపాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. మొక్కజొన్నపంట ఎకరానికి రూ 60 వేలు పెట్టుబడిపెట్టి పండించి ఇంటికి తీసుకొచ్చిన మొక్కజొన్న ధాన్యాన్ని ప్రభుత్వాలు మద్దతుధర

మిగతా 2లో..

# అంగరంగ వైభవంగా గుట్ట వెంకన్న పెండ్లి

- వేలాదిగా తరలి వచ్చిన భక్తజనం
- ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం మంత్రులు తుమ్మల, పొంగులేటి
- ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించిన కార్పోరేటర్

**ప్రజాపక్షం/పాల్వంచ :** తెలంగాణ తిరుమలగా పేరుగాంచిన పాల్వంచ శ్రీనివాసకాలనీ గుట్టపై స్వయంభూగా వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి (వెంకన్న) కళ్యాణ మహోత్సవం అర్చకులు ఎడవల్లి హరిచార్యుల నేతృత్వంలో అంగరంగ వైభవోపేతంగా జరిగింది. ముందుగా అర్చకులు, ఆలయ భక్త సమాజ మండలి సభ్యులు, భక్తులు ఉత్సవ మూర్తులను మేళ తాళాలతో పెండ్లి మండపానికి తీసుకొచ్చారు. అకిలాండకోటి బ్రహ్మాండనాయకుడు శ్రీనివాసుడి తిరుకళ్యాణ మహోత్సవ కార్యక్రమం ఆదివారం వేలాదిగా తరలివచ్చిన భక్తజన సందోహం మద్యన ఎదుర్కోలు ఉత్సవం అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చవాలు, మంగళ వాయిద్యాల నడుమ అత్యంత వైభవోపేతంగా, కన్నుల పండువగా సాగింది. ఆద్యంతం గోవింద నామ స్మరణతో కళ్యాణ వేదిక మారుమోగింది. ఆహ్లాదకరమైన

మిగతా 2లో..







# పార్టీ కార్యాలయాలు..ఉద్యమ కేంద్రాలు






(మొదటిపేజీ తరువాయి)
రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. సిపిఐ మండల కార్యదర్శి యంగళ ఆనందరావు అధ్యక్షతన జరిగిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన తుది శ్వాస వరకు పోరాడి శత్రువుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన తూము ప్రకాశరావు చిరస్మరణీయుడన్నారు. ఆయన దళితుల అభ్యున్నతి కోసం దళితులకు భూమి దక్కాలని పోరాడారని ఆయన పేరున ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా పేరొందాలన్నారు. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని అవసరాలకు అనుగుణంగా పార్టీ కార్యకర్తలను పెంచుకోవడంతో పాటు పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు సిపిఐ ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. ఒక పక్క మతోన్మాదం, మరో పక్క పెరుగుతున్న ఆర్థిక అంతరాలు దేశానికి ప్రమాదకరంగా మారాయన్నారు. ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని ఆయన తెలిపారు. మత ఉన్మాదం ప్రజల మధ్య చీలికలు తెస్తుందని ఇది దేశ సమగ్రతకు, ఐక్యతకు ఇబ్బందికరంగా మారనుందన్నారు. దేశ సంపద కొంత మంది చేతుల్లో పోగుపడుతుందని సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతున్నారన్నారు. రాష్ట్రంలోనూ ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు పార్టీ పోరాట పంథాను అనుసరిస్తుందని ఎన్నికలు వేరు, ప్రజా పోరాటాలు వేరు అని కమ్యూనిస్టు పార్టీ కార్యాచరణలో ఎన్నికలు ఒక భాగం మాత్రమేనని సాంబశివరావు స్పష్టం చేశారు. కా॥ తూము ప్రకాశరావు పేరున పార్టీ కార్యాలయ ఏర్పాటుకు వారి కుటుంబ సభ్యులు ముఖ్యంగా బత్తినేని నాగప్రసాద్, నీరజ, ప్రకాష్, రాకేష్ లు సహకరించడం అభినందనీయమన్నారు. ఎంత చదువుకున్న, ఎక్కడ జీవించినా అమరుల ఆశయ సాధనలో పాలు పంచుకోవడం ఆదర్శమని సాంబశివరావు తెలిపారు. రానున్న కాలంలో పార్టీని విస్తరించాలని ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీకి పట్టుకొమ్మగా ఉన్న ఈ ప్రాంతంలో మరల కమ్యూనిస్టు పార్టీ బలం పుంజుకునేవిధంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల వెన్నంటి నిలిచి పనిచేస్తే అద్భుత ఫలితాలు వస్తాయనడానికి ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలే నిదర్శనమని వందకు పైగా పంచాయతీల్లోనూ 40కు పైగా కౌన్సిలర్లు, కార్పోరేటర్లను గెలుచుకోవడం జరిగిందని వీటిలో 90 శాతంకు పైగా ఒంటరిగానే పోటీ చేసి గెలుపొందామని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారానికి పోరాట మార్గాన్ని ఎంచుకోవడమే లక్ష్యంగా తూము ప్రకాశ రావు భవన్ పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ మధిర తాలూకా కమ్యూనిస్టు ఉద్యమానికి కేంద్రంగా భాసిల్లిందని అనేక మంది యోధులు కమ్యూనిస్టు పార్టీ కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించారన్నారు. నాటి సాయుధ పోరాటం నుంచి నిన్న మొన్నటి పోరాటాలలో అమరులైన వారి ఆశయ సాధనకు పునరంకితం కావడమే నిజమైన నివాళి అన్నారు.ఈ సభలో రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, బత్తినేని నీరజ, ప్రకాష్, రాకేష్, సిపిఎం నాయకులు కిలారు సురేష్, బిఆర్ఎస్ నాయకులు బానోత్ కొండ, కాంగ్రెస్ నాయకులు దుర్గారావు, టిడిపి నాయకులు సత్యనారాయణ తదితరులు ప్రసంగించగా ఏనుగు గాంధీ, బత్తినేని నాగప్రసాద్, తూము రోషన్‌కుమార్, జక్కుల రామారావు, పోటు సాత్విక్, గ్రామ సర్పంచ్ బానోత్ జ్యోతి, మండల సహాయ కార్యదర్శులు ఆకెన పవన్, బుర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



**అమరులకు నివాళులు :**
సిపిఐ నాయకులు బుంగ నాగభూషణం, వెంకట నర్సమ్మ, జనార్ధన్‌రావు లకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నివాళులర్పించారు. బుంగ నాగభూషణం, వెంకట నర్సమ్మ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ అమరుల ఆశయ సాధన కోసం పునరంకితం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లపాడు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బుంగ నాగభూషణం, వెంకటనర్సమ్మ కుమార్తె వెంకట్రావమ్మ, ఐతం రాజు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గుట్ట వెంకన్న పెండ్లి

(మొదటిపేజీ తరువాయి)
వాతావరణంలో ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తుల సౌకర్యం కోసం భారీ ఎత్తున తాటాకులతో చలువ పందిళ్ళను వేశారు. ప్రణాళికా ప్రకారం ప్రచారం చేయటంతో స్వామి కళ్యాణ మహోత్సవానికి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు.

**-మంత్రులకు ఆలయ మర్యాదలతో స్వాగతం**
సుమారు 1800 మెట్లు ఎక్కి శ్రీ వేంకటేశ్వరుడి కళ్యాణ మహోత్సవానికి హాజరైన రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంభంధాల శాఖ మంత్రి పొంగులేటి దంపతులకు ఆలయ కమిటి సభ్యులు, అర్చకులు ఆలయ సాంప్రదాయ ప్రకారం, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం గుట్టపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలో స్వామివారి కళ్యాణ మహోత్సవంలోపాల్గొనిస్వామి,అమ్మవార్లకుపట్టువస్త్రాలను సమర్పించారు.

**- ఏకోటూరిజంగా అభివృద్ధికి కృషి చేస్తా :**
ప్రజల, భక్తుల సౌకర్యం కోసం శ్రీనివాసగిరి గుట్ట అభివృద్ధికి పటుపడతానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో అటవీశాఖతో సమన్వయం చేసుకొని ఏకోటూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. భక్తులకు అవసరమైన వసతులను కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

**- దేవాలయాలు గుట్టలపైనే ఉండాలి :**
ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో ఆలయాలు గుట్టల ( ఎత్తైన ప్రదేశాలలో ) పైనే ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గత 40 సంవత్సరాలుగా ఆలయానికి రావాలనుకున్నప్పటికీ సాధ్యం కాలేదన్నారు. స్వామి వారి కృపతో ఇప్పటికి నా కోరిక తీరిందని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్యన ఐక్యతను, భక్తి భావాలను పెంచటానికి ముఖ్య పాత్ర వహిస్తాయని చెప్పారు. స్వామివారి దయతో, స్వామి వారు కోరుకుంటే ఆలయ అభివృద్ధి జరుగుతుంన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**- కళ్యాణ క్రతువులో పాల్గొన్న ఎంపి :**
గుట్టపై వేంచేసియున్న అత్యంత ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకన్న స్వామి వారి కళ్యాణ క్రతువులో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర



పాల్గొన్నారు. అర్చకులు, భక్త సమాజ మండలి సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు.

**- అయ్యప్ప స్వామి ఆలయం నుండి పట్టు వస్త్రాలు :**
శ్రీనివాసగిరిపై వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవానికి పాల్వంచ పట్టణంలోని ప్రముఖ ఆలయమైన అయ్యప్పస్వామి దేవాలయం నుండి చీరె, సారె, పట్టు వస్త్రాలు, పసుపు,కుంకుమ, తలంబ్రాలు, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు చేతుల మీదుగా స్వామి వారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్‌పి. బిరుదురాజు రోహిత్ రాజు, పాల్వంచ తహశీల్దార్ దారా ప్రసాద్, కొత్తగూడెం మునిపల్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, కార్పోరేటర్‌లు దంతెరబోయిన నరేష్, గోవాడ గుణచరిత్, కాల్వ భాస్కర్‌రావు, కొత్వాల విమలాదేవి, పైడిపల్లి విజయలక్ష్మి, మల్లెల స్వప్నకుమారి, చెరుకు భాగ్యలక్ష్మి, బాలునాయక్, ఆలయ ట్రస్టు ఛైర్మన్, కో ఛైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు, మందడపు ముక్కంటేశ్వరరావు, గౌరవ సలహాదారు వంకధారు నరసింహ కుమార్, ఆలయ ట్రస్ట్, భక్త సమాజ మండలి సభ్యులు ఊకె భద్రయ్య, ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్‌శర్మ, ఫణిశర్మ పాల్గొన్నారు.

**- ఆలయ మర్యాదలకు భంగం :**
ఆలయ మర్యాదలకు తూట్లు పొడుస్తూ బిఆర్ఎస్ పార్టీ నుండి కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ ఎన్నికలలో గెలిచిన ఓకార్పోరేటర్ అత్యుత్సాహం ప్రదర్శించారు. దేవాలయ గర్భగుడిలో స్వామి విగ్రహాలను ఫోటోలు తీశారు. దీనితో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఆలయ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగిందని మండిపడుతున్నారు. ఇలాంటి చర్యలు పునారావృతం కాకుండా ఆలయ ట్రస్టు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

# లాభదాయక పంటలవైపు రైతులు దృష్టి సారించాలి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** రైతులు లాభదాయక పంటలవైపు మొగ్గుచూపి లాభాలు ఆర్జించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండలపరిదిలోని అంజనాపురం లో నిర్మిస్తున్న గోద్రెజ్ ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలో ఆయిల్‌ఫామ్ మొక్కలు తీసుకొచ్చి మొదటిసారిగా నాటడం జరిగిందని అప్పటివరకు మనకు ఈపంటలేదని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఆయిల్‌పామ్ పంట విస్తరణ కోసంఅనుమతులు తాను సాధించినట్లు తెలిపారు. ప్రతి ఎకరానికి రూ 51 వేల సబ్సిడిని ప్రభుత్వం రైతులకు అందిస్తుందని అన్నారు. పంటలు మార్పిడి చేసుకోలేకపోతే రైతులు ఇబ్బందులు పడతారని తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలో వరి వేయకపోతే డబ్బులు ఇస్తున్నారని యూరియా అధికంగా వాడటంవల్ల పంజాబ్‌లో క్యాన్సర్ ఎక్కువ అయింతని పేర్కొన్నారు. ప్రస్తుతం మనదగ్గరకూడా యూరియా అధికంగా వాడుతున్నారని దీనివల్ల నష్టాలు వస్తాయని తెలిపారు. మల్టీ నేషనల్ కంపెనీ గోద్రెజ్ వ్యవసాయ ఉత్పత్తులపై దృష్టిసారించిందని ఏపిలో గతంలోనే ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారని ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో ఫ్యాక్టరీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 22న సిద్దిపేట జిల్లాలో సిఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా జరిగే నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రైతులు వెళ్లాలని అక్కడ మూడురోజులపాటు వ్యవసాయ ప్రదర్శన ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటి ఛైర్మన్ హనుమంతురావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ప్రాజెక్ట్ డిజిఎం, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా ఇవ్వండి


**(మొదటిపేజీ తరువాయి)**2400 మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంబించి మొక్కజొన్న ధాన్యం కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి కొనుగోలు చర్యలు చేపట్టకపోవడం చాలా విచారకరమని అన్నారు. విద్యుత్ సరఫరా సబ్సీడీలు ఎత్తివేసి విద్యుత్‌భారాన్ని రైతులపై మోపి కేందరంలో నరేంద్రమోడి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణబిల్లును తీసుకొస్తుంని పేర్కొన్నారు. వ్యవసాయరంగాన్ని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సమగ్ర పంటల మద్దతు ధర చట్టం తీసుకురావాలని సోమనాథన్ కమిషన్ సిఫారసులు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, రైతుసంఘం నాయకులు తోటపల్లి సీతారాములు, కొమ్మినేని నరసింహారావు, అడపా వెంకటేశ్వర్లు, దొండపాటి కిషన్‌రావు, అడపా భాస్కర్‌రావు, తుప్పతి వెంకటేశ్వర్లు, సూరంపల్లి రమేష్, దొండపాటి సూర్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం రైతుసంఘం సభ్యత్వాన్ని పద్మకి అందజేశారు.

# సబ్‌స్టేషన్ ప్రహారీగోడ నిర్మాణంలో నాణ్యత ఏది?

**-అధికారుల పర్యవేక్షణ కరువు**
**-పగిలిపోతున్న ప్రహారీగోడ**
**-అధికారుల మౌనం కాంట్రాక్టర్‌కు వరం**







**ప్రజాపక్షం/వైరా:** విద్యుత్‌శాఖలో కాంట్రాక్ట్ పనులు పర్యవేక్షణలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్‌శాఖలో సంబంధిత వర్క్‌లకు సంబంధించి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కనుసైగల్లోనే క్వాలిటీ లేకపోయినా అధికారులు అండగా ఉంటున్నారు అనే వాదనలు వినిపిస్తున్నాయి. వైరా విద్యుత్‌స్టేషన్ ఇటీవల ప్రహారీగోడ నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఆ టెండర్ దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్టర్ గోడ నిఆ్మణం చేపట్టాడు. గోడ నిర్మాణం చేసిన కొన్ని రోజులు గడవక ముందే ప్రహారీగోడ ఎక్కడిపడితే అక్కడ పగుళ్లు ప్రారంభమయ్యాయి. అంటే ప్రహారీగోడ నిర్మాణం ఎంత క్వాలిటీతో నిర్మించారో ఒక్కసారి చూస్తూ అర్థమవుతుంది. ఎండలు ప్రారంభానికి ముందే ప్రహారీగోడ పగుళ్లతో దర్శనమిస్తుంటే ఎండలు ఎక్కువ అయిన తర్వాత గోడ ఏ విధంగా ఉంటుందో ఆలోచించాలి. ప్రహారీ నిర్మాణం జరిగేటప్పుడు సంబంధిత అధికారులు ఆ ప్రాంతంలో లేరనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్ కనుసైగల్లోనే పర్యవేక్షించాల్సిన అధికారి లేరు అనే వాదన కూడా వినిపిస్తూ ఉంది. ప్రభుత్వం అభివృద్ధి కోసం నిధులు ఇస్తూ ఉంటే ఆ నిధులను సక్రమమైన మార్గంలో పనులు చేపించే విషయంలో అధికార యంత్రాంగం ఎందుకు విఫ్లమవుతుంది. ఒక్కసారి వైరా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్మించిన ప్రహారీ పరిశీలన చేసి ఎక్కడెక్కడ పగుళ్లు ఉన్నాయని ఏ విధంగా పగిలిపోతుంది తెలుస్తుంది. ఇప్పటికైనా అధికారులు ప్రహారీగోడ నిర్మాణంలో నాణ్యత ఉందా లేదా అనేది తెలుసుకోవాలి.

# వైరాలో ఘనంగా నామ జన్మదిన వేడుకలు

**పాల్గొన్న బిఆర్‌ఎస్ శ్రేణులు**



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా ప్రజలు గుండెల్లో పెట్టుకొని చూసే నాయకుడు మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు అని వైరా మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, లకావత్ గిరిబాబు అన్నారు. ఆదివారం వైరా రింగు రోడ్డు సెంటర్‌లో ఇండోర్ స్టేడియం వద్ద మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు జన్మదిన సందర్భంగా బిఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున వైరా చేరుకొని జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిటాయిలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు తొలుత ఓటు వేసి తెలంగాణ రాష్ట్రం సిద్దించేందుకు కృషి చేసిన మహా నాయకుడు నామ నాగేశ్వరరావు అని అన్నారు. నామ ముత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఎంతోమందికి అండగా నిలిచారు అని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆటో డ్రైవర్‌కు యూనిఫాం అందించిన చేయూతను అందించిన ఘనత ఆయనది అన్నారు. గ్రామాల్లో మంచినీటి కొరత లేకుండా నామ ముత్తయ్య ట్రస్ట్ ద్వారా ట్యాంకర్లతో త్రాగునీటిని అందించారు అన్నారు. ప్రజాసేవ చేసేందుకు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండే ప్రజల మధ్యలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అప్పం సురేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు సక్కుబాయి, 11వ వార్డు కౌన్సిలర్ దొంతబోయిన వెంకటేశ్వర్లు, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ సభ్యులు షేక్ లాల్‌మహ్మద్, కామినేని శ్రీనివాసరావు, మాదినేని దుర్గాప్రసాద్, తిరుపతి శ్రీనివాసరావు, ఏదునూరి శ్రీనివాసరావు, ఏనుగు హనుమంతరావు, వల్లాపురం ఉప సర్పంచ్ వేల్పుల నారాయణ, మాజీ సర్పంచ్ బట్టా భద్రయ్య, మరికంటి శివ, మద్దెల రవి, నూకల వాసు, అయినాల కనకరత్నం, వేముల రవి, బొడ్డు రామకృష్ణ, బండారు శ్రీనివాసరావు, కారుకొండ బోస్, బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, బత్తుల లింగారావు, దొంతెబోయిన చింతయ్య, దాసరి శ్రీనివాసరావు, వల్లెపు రాము తదితరులు పాల్గొన్నారు.

# మీ ఆరోగ్య భద్రత మా బాధ్యత

**మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో ఆదివారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు, వాటర్ కార్మికులకు పర్సనల్(పిపిఈ) ప్రొటెక్షన్ ఈక్యూబ్‌మెంట్ కిట్స్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, కౌన్సిలర్లతో కలిసి అందజేశారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం కోసం మున్సిపల్ కార్యాలయంలోనే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈస ందర్భంగా కార్మికులకు కిట్స్ పంపిణీ అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే మున్సిపాలిటీ ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఎందుకు అంటే మీ ఆరోగ్యం మా బాధ్యత అందుకు మీరు పారిశుధ్య పనులు చేసేటప్పుడు తప్పనిసరిగా గ్లౌజులు బూట్లు వాడాలని పనులు అనంతరం చేతులను శుభ్రంగా కడుక్కోవాలని ఆమె సూచించాఈరు. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంది అని తెలిపారు. మున్సిపాలిటీకి మంచి పేరు రావాలి అన్నా మా అందరికి సముచిత స్థానం మార్కెట్‌లో ఉండాలన్న మీ పనితీరు మీద ఆధారపడి ఉందని ఆమె సూచించారు. ప్రతి కార్మికుడు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మద్యానికి బానిస కావద్దు జీవితాన్ని ఆగం చేసుకోవద్దు ఆరోగ్యాని పాడు చేసుకోవద్దని ఆమె సూచించారు. వచ్చే నెలలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు మెగా వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుంది. ఈ శిబిరంలో మీ కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్ష, మున్సిపల్ కమీషనర్ గురులింగం, కౌన్సిలర్లు ముళ్ళపాటి విజయ, వుంద్రు వరలక్ష్మి, మాదినేని సునీత, వేముల శ్రావణి, నల్లమోతు శైలజ, గోరింట్ల శ్రీదేవి, చింతనిప్పు సులోచన, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, మోరు శ్రీకాంత్, పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

**- 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నిరంతంరం చెత్త, మురుగు తొలగింపులో సేవలందిస్తున్న కార్మికుల కోసం వైద్య శిబిరం ఏర్పా టు చేయడం అభినందనీయం అని 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు అన్నారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైద్య చికిత్సలను ఎప్పుడో శిబిరంలా కాకుండా నిత్యం కార్మికులకు అందుబాటులో ఉంచాలని డాక్టర్లను కోరారు. కార్మికుల కోసం చేసే ఈ సేవలో సిపిఐ పార్టీ తరపున తాము అండగా నిలుస్తామని పేర్కొన్నారు. అనంతరం కార్మికులను స్వయంగా వైద్యుల వద్ద చూపించి, మందులు పంపిణీ చేపించారు. ఈ సందర్భంగా కార్మికులకు కూడా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్సెపెక్టర్ శ్రీనివాస్, పీహెచ్‌సీ డాక్టర్ మైధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూ అక్రమదారుల ఆస్తులు గుర్తింపు

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** వెలుగుమట్ల భూదాన్‌భూముల్లో వసూళ్లకు పాల్పడిన నలుగురు నిందితులకు సంభందించిన ఆస్తులను గుర్తించినట్లు అడిషనల్ డిసిపి లాఅండ్ ఆడర్ ప్రసాద్ రావు తెలిపారు. పేదల దగ్గర వసూళ్లకు పాల్పడి ఆక్రమ ఆస్తులు కొనుగోలు చేసినట్లు తమ విచారణలో తేలిందని వాటి అటాచ్‌మెంటుకు చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా వారి బ్యాంక్‌ఖాతాలో జరిగిన నగదు బదిలీలను గుర్తించి ఫ్రీజ్ చేయడం కోసం బ్యాంక్ అధికారులకు లిఖితపూర్వక సిఫార్స్ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే అరెస్ట్ అయిన నిందితుల కస్టడి కోసం కోర్టును ఆశ్రయించామన్నారు. నిందితుల నుంచి మరింత సమాచారం సేకరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానంగా కేసులోని నిందులంతా ఒక ముఠాగా ఏర్పాడి ఒక్కొక్క ప్లాటును ముగ్గురు, నలుగురికి విక్రయించి డబ్బులు తీసుకున్నట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు.

# చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 13వ వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు జరిగిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ, వైరా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముళ్ళపాటి విజయ సీతారాములు మాట్లాడుతూ పిల్లలకు అక్షరాభ్యాసం చేపించడం ఎంతో సంతృప్తినిచ్చిందని, భవిష్యత్తుల మంచిగా చదువుకొని ఉన్నత చక్రాలు తిరిగే విధంగా భగవంతుడు ఆరోగ్యాన్ని సంతోషాన్ని అందించాలని దీవించారు. అనంతరం ముళ్ళపాటి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాడిశ రవి, రాయి హుస్సేన్, ఈలప్రోలు ప్రశాంత్, రాచకొండ సాయి, తోట సైదులు, బొడ్డుపల్లి కృష్ణశాస్త్రి, అంగన్‌వాడీ టీచర్ అన్నపూపర్ణ, ఆయా పేరూరి కుమారి, ఏఎన్‌ఎంలు ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# విజయవంతమైన వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక పారిశుధ్య కార్యక్రమాల ముగిం పు సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం విజయవంతమయ్యింది. దీనిని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎంవీ, పాలెం పిహెచ్‌సీ సౌజన్యంతో నిర్వహించారు. ఇందులో వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్‌తో పాటు కౌన్సిలర్లు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అలాగే మల్టీపర్పస్ వర్కర్లకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దివ్య,దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, మహేష్, ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ మహేందర్‌రెడ్డి, శానిటేషన్ ఇన్సెపెక్టర్ పిల్లి శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఎండీ ఫరీద్, జవాన్లు పాల్గొన్నారు.

# సిపిఎం ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** 2024లో వచ్చిన వరద విపత్తుతో ఖమ్మంకురవి బ్రిడ్జికూలీ రెండు సంవత్సరాలు కావోస్తున్న మంత్రులకు కనిపించడం లేదా? అని సీపీఎం మండల నాయకుడు పొన్నం వెంకటరమణ ప్రశ్నించారు. ఈ మేరకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కూలీన బ్రిడ్జి వద్ద తక్షణమే దానిని నిర్మాణం చేపట్టాలని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పాత చప్టాపై నుంచి తాత్కాలికంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు వెలుతున్నాయన్నారు. బస్సులు, భారీ వాహనాలు రాకపోవడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యం వేల మంది ప్రయాణించే రహదారి బ్రిడ్జీ లేకపోవడంతో ప్రజల అవస్థలు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా ఇప్పటివరకు ఏమీ పట్టనట్టు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. తక్షణమే మంత్రులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పొన్నం భాస్కర్ రావు, పొన్నం మురళి, చాంద్‌పాషా, యల్దిపరశురాం, కారుమంచి చలమయ్య , గూడూరు రాజేష్, అద్దంకి ఉపేందర్, పయ్యావుల వెంకటప్పయ్య, ధరావత్ నరేష్, వెంకన్న, అశోక్, మాలోత్ వీరన్న, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ మండల కార్యదర్శిని పరామర్శించిన కూనంనేని



ప్రజాపక్షం/జూలూరుపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు ను ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసన సభ్యులు కునంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా లు పరామర్శించారు. ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనే వెంకటేశ్వర్ల కు ప్రమాదం జరగటం పట్ల ధైర్యంగా ఉండాలని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎల్లంకి మధు, గుడిమెట్ల సీతయ్య కంచర్ల రాఘవేంద్రరావు అనుమల అశోక్ చెరుకుమల రామకృష్ణ, షేక్ బుడెన్ పాషా పతి పాటి మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా పరామర్శించారు.

## ఘనంగా నామ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండలం కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు యల్లంకి సత్య నారాయణ నివాసం వద్ద బీఆర్ఎస్ మాజీ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు యల్లంకి సత్యనారాయణ, జూలూరుపాడు మండల అధ్యక్షులు చాపల మడుగు రామ్మూర్తి కేక్ కట్ చేసి మాజీ పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావుకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దుద్దుకూరి నాగేశ్వరరావు, దుద్దుపూరి కృష్ణ ప్రసాద్, రాయపాటి వెంకటేశ్వర్లు, తాళ్లూరి రామారావు, తాళ్లూరి నవీన్, పురస్తపురవు రామకృష్ణ, ఇల్లంగి తిరుపతి, ఇసం రవి, మోదుగు నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్చరీలో సత్తా చాటిన ఆదివాసి ఆణిముత్యం

### జాతీయ స్థాయికి ఎంపిక



ప్రజాపక్షం/కరకగూడెం: తాటిగూడెం గ్రామానికి చెందిన కొమరం అశ్విత్ దొర ఛత్తీస్ ఘడ్ ల రాష్ట్రంలో ఈనెల 26 నుండి 29 వరకు జరగనున్న జాతీయస్థాయి ఖేలో ఇండియా ట్రైబల్ ఆర్చరీ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుండి నలుగురు ట్రైబల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికలో కరకగూడెం మండలంలోని తాటిగూడెం గ్రామానికి చెందిన కొమరం వెంకట నారాయణ భద్రాచలం ఐటిడిఏ అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ కుమారుడు కొమరం అశ్విత్ దొర ఎంపిక కావడం గర్వకారణం. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన ఆర్చరీ పోటీల్లో అశ్విత్ దొర తెలంగాణ రాష్ట్ర ప్రాతినిధ్యం వహిస్తూ, అత్యంత ప్రతిభ కనబరిచారు.జాతీయ స్థాయికి పోటీలకు అశ్విత్ దొర ఎంపికైనందుకు తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఆర్చరీ అసోసియేషన్ వారు ప్రత్యేకంగా అభినందించారు. అదే విధంగా ఈ నెలలో జరిగే జాతీయస్థాయి ఆర్చరీ పోటీలలో రాణించి మన ప్రాంతానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## మున్సిపాలిటీలో హెల్త్ క్యాంప్




ప్రజాపక్షం/మణుగూరు: ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా మణుగూరు మున్సిపాలిటీ లో మున్సిపల్ వర్కర్స్ కు షుగర్ , బీపీ రక్త పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరిగింది. వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని, ఒత్తిడి లేకుండా పనిచేసుకోవాలని సూచించారు. అదే విధంగా పగిడేరు, రామానుజ వరం పంచాయతీ లో కూడా క్యాంప్ నిర్వహించడం జరిగింది. రాంప్రసాద్, రామలక్ష్మి, ఇందిరా, రమణ, శ్యాం, విజయ్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వర్కర్లకు పరిశుభ్రత కిట్ల పంపిణీ



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మున్సిపాలిటీలో ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపల్ వర్కర్లకు పరిశుభ్రత కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీకి చెందిన 66 మంది మున్సిపల్ కార్మికులకు ఒక సంవత్సరానికి అవసరమైన పరిశుభ్రత వస్తువులను అందజేశారు. ప్రతి కార్మికునికి 12 సంతోర్ సబ్బులు, 12 రిన్ సబ్బులు, 12 కొబ్బరి నూనె సీసాలు, అర్ధ కిలో బెల్లం అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, టీపీఓ శ్యామ్, ఏఈ మేడమ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దాతగా దండా రాధాకృష్ణ సహకారం అందించారు.

# ప్రకృతి పానీయం కల్లు..!

**-కల్లు అంటే పొద్దాడే**
**-పల్లె పట్నం అనే తేడా లేకుండా ఇష్టపడేది కల్లు**
**-నీర అంటే సేవించాల్సిందే..**





ప్రజాపక్షం/వైరా: గీత కార్మికుడు తాటి చెట్టు నుంచి సేకరించే సహజ సిద్ధమైన పాణ్యం కల్లు పొద్దాడు పరుపు పండుదాల్లు అనే మూడు రకాలుగా తాటి చెట్టు నుండి గ్రామీణ ప్రాంత గీత కార్మికులు కల్లు సేకరిస్తారు. ఇలాంటి ఎంతో మధురమైన పానీయం గ్రామీణ పల్లెలే కాకుండా పట్నం ప్రజలు సైతం సేవించడానికి ఇష్టపడతారు. జనవరి నెల నుండి మార్చి నెల వరకు సేకరించే పొద్దాడు కల్లు సేవించితే ఆరోగ్యపరమైన లాభాలు చేకూరుతాయని పొందాడు. కల్లు సేవించడానికి ఇష్టపడతారు. ఉదయం పూట తీసే పొద్దాడు కల్లు కుండల్ల బాటిల్లో తెల్లగా పొంగుతున్న కల్లును మోదుగు ఆకులో తాగుతుంటే ఆ మజానే వేరుగా ఉంటుందని కల్లు ప్రియులు చెప్పుకుంటారు. వైరా మండలంలో గొల్లెనపాడు, తాటిపూడి గౌండ్లపాలెం, కొండకొడెం అడ్డ రోడ్డు సోమవరంతో పాటు పలు ప్రాంతాల్లో తాటికల్లుకు భలే గిరాకీ ఉంటుంది. ఉదయం పూట కల్లు ప్రియులు వస్తూ ఉంటారు. సహజసిద్ధమైన ప్రకృతి ఒడిలో నుండి పంట పొలాల మధ్య పెరిగిన తాటిచెట్ల వద్దకు వెళ్లి కల్లును సేవిస్తుంటారు. తెల్లవారుజామున సేవించే నీర కల్లుకు ఇప్పటికీ డిమాండ్ తగ్గలేదని చెప్పవచ్చును. చల్లని వాతావరణంలో తెల్లవారుజామున తాగే నీర కల్లుకు బాగా డిమాండ్ ఉంటుంది. జనవరి నెల ప్రారంభం అవుతుంది. అంటే గ్రామీణ ప్రాంతాల్లో తాటి కల్లు కోసం ఎదురుచూస్తూ ఉంటారు. తాటి రేకు కట్టించుకొని తాగుతుంటే మజా మరువలేమని కల్లు ప్రియులు తెలుపుతున్నారు. గీత కార్మికులకు జనవరి నుంచి మార్చి వరకు జీవనోపాధిని కల్లు కలిపిస్తుంది. పెద్ద పెద్ద పొడవైన చెట్లను పైకి ఎక్కి కల్లు తీసుకు కార్మికులు జీవనం గడుపుతున్నారు. నేటికి తాటికల్లుకు మంచి డిమాండే ఉందని చెప్పవచ్చును. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో తాటికల్లు తాగటానికి పట్టణవాసులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారని చెప్పవచ్చు.

### గీత కార్మికుల అభివృద్ధికి తోడ్పాటు కావాలి: పోతగాని నరసింహరావు(గీత కార్మికుడు గొల్లెనపాడు)



ఎంతోమంది గీత కార్మికులు తాటిచెట్లపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని, తాటికల్లు తీయడానికి చెట్ల పైకి ఎక్కి తీసుకురావాల్సి వస్తుంది. కొన్ని కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ప్రభుత్వం మరింత మెరుగైన సౌకర్యాలు గీత కార్మికులు కల్పించి ఆదుకోవాలి అని వైరా మండలం గొల్లెనపాడు గ్రామానికి చెందిన గీత కార్మికుడు పోతగాని నరసరావు తెలిపారు.

# మంత్రి ఆదేశాలు భేఖాతర్..!

**- ప్రజా పంపిణీ వ్యవస్థపై పట్టింపు లేకపాయే..**
**- డీలర్ ఇచ్చిన బియ్యంపై అదనపు కలెక్టర్ సైతం ఆగ్రహం**
**- ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుంటారా?**

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్క్రాస్రోడ్ ప్రాంత ప్రజల రేషన్ కష్టాలపై ప్రజాపక్షం దినపత్రిక సమస్యలే అక్షరాలుగా ఈ బాధలు తీరేదెన్నడో? అనే కథనాన్ని జనవరి 9వ తేదీన ప్రచురించిన విషయం విధితమే. దీనిపై మరుసటిరోజు మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డికి సిపిఐ ఆధ్వర్యంలో రేషన్ షాపు ఏర్పాటుకు వినతి పత్రం అందజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరపు నుంచి సరఫార చేసిన రేషన్బియ్యంలో లావు బియ్యం ఇచ్చారంటూ ఫోటోలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి తక్షణమే అక్కడ ఉన్న అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజకు పరిశీలన చేసి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. కానీ ఈ ఘటన జరిగి నేటికి రెండు నెలలు కావొస్తుంది. అయినప్పటికీ ఇంతవరకు ఆ విషయాన్ని పట్టించుకునే వారు లేకపోవడం విస్మయానికి గురిచేస్తుంది. ఈ నేపథ్యంలో మంత్రి ఆదేశాలు బుట్ట దాఖలవుతుండంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### రేషన్ బియ్యం కలిసినట్టుగా ఆరోపణలు...

వాస్తవానికి ప్రజాపక్షం దినపత్రిక రేషన్ సమస్యపై అదేరోజున సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిస్థితిపై వాక్ట్ చేసింది. దీంతో సదరు డీలర్ హూటాహుటీన బియ్యాన్ని ఆ రోజు రాత్రి వరకు పంపిణీ చేశాడు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇక్కడే ఓ ట్విస్ట్ ఉంది. అది ఏమిటంటే సదరు డీలర్ ఇచ్చిన స్టాక్ అయిపోయాయి,బియ్యం లేవు అయిపోయాయంటూ బియ్యానికి వచ్చిన వారికి చెప్పాడు. కానీ ప్రజాపక్షం ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో బియ్యం పంపిణీ చేశాడు. అంటే అయిపోయిన బియ్యం ఎలా? వచ్చాయో? విషయం అవగతం చేసుకోవాల్సిందే. ఈ సందర్భంగా బియ్యం తీసుకున్న లబ్ధిదారులు రెండు, మూడు రోజుల వరకు చెరిగి, దుబ్బ, ధూలి, రాళ్లను లబ్ధిదారులు తీసేందుకు సమయం వెచ్చించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం పడుతుంది. ఈ బియ్యం పంపిణీ చేసిన సదరు డీలర్పై అదనపు కలెక్టర్ శ్రీనివాస్రెడ్డి మీటింగ్లో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కొందరు డీలర్లు గుసగుసలాడుతుండటం గమనార్హం.

### రెండు నెలలు గడిచిన బియ్యం ఉంటాయా?

చేతులు కాలిన తర్వాత ఆకుటు పట్టుకోవడం అనే సామెత ఇప్పుడు ఇక్కడ కరెక్ట్గా సరిపోయేలా కపిస్తోంది. బియ్యం పంపిణీ జరిగి రెండు నెలలు గడిచిన తర్వాత విచారణ చేస్తే బియ్యం ఉంటాయా? అనేది ఆలోచించాల్సిన అంశమే. మరి అలాంటి తరుణంలో అవి రేషన్ బియ్యం అనేది తేలే అవకాశం లేదు. అయితే ఇలా జరగడంలో పెద్ద హస్తం కలిగిన జిల్లా నాయకుడితో పాటు అక్రమాలలో అందెవేసిన చెయ్యి కావడంతో తాత్సారం జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు మంత్రి ఆదేశాలపై ఏం తెలుస్తారో వేచి చూడాల్సిందే. ఒక వేళ పత్రికలో తప్పిదాన్ని ప్రశ్నిస్తూ కథనం వచ్చింది కాబట్టి. మసిపూసి మారేడు కాయ చేసే విధంగా పరిశీలన చేసి లావు బియ్యం కాదని నివేదిక బహుశా ఇవ్వచ్చేమో?

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల కఠిన చర్యలు

**-ట్రాక్టర్, ఫ్రంట్ లోడర్ సీజ్.. కేసు నమోదు**



ప్రజాపక్షం/అశ్వాపురం: గోదావరి నది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, ఫ్రంట్ లోడర్ను పోలీసులు పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈఘటన ఆదివారం తెల్లవారుజామున అశ్వాపురం మడంలం చింతిర్యాల సమీపంలో చోటు చేసుకుంది. ఈవిషయంపై సీఐ అశోక్రెడ్డి మాట్లాడుతూ గోదావరి నది నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ను గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. కొమరం నరసింహారావు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్ను సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే ఇసుకను లోడ్ చేయడానికి ఉపయోగించిన రామచంద్రపురం గ్రామానికి చెందిన మిట్టకంటి మహేష్రెడ్డి యాజమాన్యంలోని ఫ్రంట్ లోడర్ ట్రాక్టర్ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై పీడీపీపీ చట్టం కింద నరసింహారావు, మిట్టకంటి మహేష్రెడ్డి, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గోదావరి నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని, ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

# నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పనులు..!

**-పట్టించుకోని పంచాయతీ రాజ్ అధికారులు**
**-అధికారుల తీరుతో సర్వత్రా విమర్శలు**



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెం గ్రామం నుండి సమీప తిరుమలపాలెం మండలంలోని గోపాలపురం గ్రామం వరకు 2024, 25 ఎఫ్డిఆర్ నిధులు రూ 3.68కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయన్న ఆరోపణలు స్థానిక ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. పనుల నాణ్యత, విధివిధానాలపై అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనంను రోడ్డు నిర్మాణ పనులకు ఉపయోగిస్తారా లేక కొందరు వ్యక్తుల కోసం నాణ్యత ప్రమాణాలను పక్కనపెట్టి వారికి కమిషన్లు ఇవ్వడానికా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. సంబంధిత పంచాయితీ రాజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల్లో సాంకేతిక ప్రమాణాలు పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డులో మొదట అడుగున 40 ఎంఎం కంకర రోలింగ్ చేసి వాటర్ క్యూరింగ్ చేయటం జీఎస్బి లెవెల్ 0.2 వచ్చే వరకు రోలింగ్ చేయడం, ఆ తర్వాత 20 ఎంఎం, 10 ఎంఎం, 6 ఎంఎం కంకర కస్ట్ మిక్డ్స్ వాడి రూలింగ్ చేసి ఆ తర్వాత వాటర్క్యూరింగ్ రోలింగ్ చేసిన తర్వాత 0.25 లెవెల్ రావాల్సి ఉంది. ఆ తర్వాతనే వీటిని వాడే అవకాశాలు ఉండగా ఇవేమి పాటించకుండా డైరెక్ట్గా 20 ఎంఎం, 10 ఎంఎం, 6 ఎంఎం మెటల్ మిక్స్డ్ డస్ట్తో త్వరితగతిన పనులు పూర్తి చేస్తున్నారు. దీంతో రోడ్డు నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనులు జరుగుతున్న సమయంలో పంచాయితీ రాజ్ శాఖ అధికారులు లేదా ఇంజనీరింగ్ సిబ్బంది పర్యవేక్షణ చాలా తక్కువగా ఉందని తెలుస్తుంది. నిర్మాణంలో ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యతను కూడా ఎవరూ పరిశీలించడం లేదని జనం ఆరోపిస్తున్నారు. ఇక ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ పనులు ప్రజల ప్రయోజనాల కోసం కాదా, లేక గుత్తేదారుల ప్రయోజనాల కోసమే జరుగుతున్నాయా అన్న సందేహాలు ప్రజల్లో పదేపదే వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### క్వాలిటీ కంట్రోల్ పరిశీలించాలి...

ఈ విషయంపై వెంటనే ఉన్నతాధికారులు స్పందించి క్వాలిటీ కంట్రోల్ అధికారుల ద్వారా పనులపై సమగ్ర విచారణ జరిపి, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పని చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

### పంచాయితీ రాజ్ ఏఈ ప్రఫుల్ కుమార్ వివరణ...

రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతోనే చేస్తున్నాము. గతంలో కంకర్ 40 ఎంఎంకు బదులుగా ఇప్పుడు కొంత పద్ధతి మారింది. చూసే వారికి అది 40 ఎంఎం కంకర కాదనిపించవచ్చు ఇప్పుడు అంతా మిక్డ్స్ గానే వస్తుంది. అందులో 40 ఎంఎం కూడా కలిపి ఉంది. దీని తర్వాత మళ్లీ సెకండ్ లేయర్లో 20 ఎంఎం, 10 ఎంఎం, 6 ఎంఎం డస్ట్ కూడా రెండో దఫాలో పోయడం జరుగుతుందని తెలిపారు.

## బొలేరో పల్టీ ఒకరు మృతి.. పలువురికి గాయాలు





ప్రజాపక్షం/కొణిజర్ల : బొలేరో పల్టీకొట్టి ఒకరుమృతిచెంది పలువురికి గాయాలైన సంఘటన మండల పరిదిలోని తనికెళ్ల సమీపంలో ఆదివారం తెల్లవారుఝామున చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా వేలేరు పాడు మండలం మాదారం గ్రామానికి చెందిన మొట్టుం సిద్దు (19), కుంజా చరణ్, కుంజా మంగరాజు, కారం రాంబాబు, పల్లా రాము, కట్టం కార్తీక్, పాయం విష్ణు, తురం రామ్చరణ్, పల్లా రాజశేఖర్, గ్రామానికి చెందిన చిచ్చుడి రాము అనే వ్యక్తి చెందిన బొలేరో వాహనంలో ఈనెల 12 న హైదరాబాద్ చూడటానికి వెళ్లి టైల్స్ కొని బొలేరోలే వేసుకొని తిరిగి శనివారం రాత్రి హైదరాబాద్నుంచి బయలు దేరి ఇంటికి వస్తుండగా ఆదివారం తెల్లవారుఝామున సుమారు గం 5 30 నిమిషాల సమయంలో తనికెళ్ల సమీపంలోకి రాగానే డ్రయివర్ అజాగ్రత్తగా అతివేగంగా వాహనాన్ని నడుపుతుండటంతో బొలేరే బోల్తాపడింది. దీంతో దాంట్లో ప్రయాణిస్తున్న వారంతా రోడ్డుపై పడ్డారు. మొట్టం సిద్దుపై ట్రక్లో ఉన్న టైల్స్ మీదపడటంతో తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలో మృతిచెందాడు. మిగిలిన వారందరికి గాయాలు కావడంతో 108 లో వారందరని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి మొట్టం లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లు పంపిణీ



ప్రజాపక్షం/బూర్గంపాడు: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం కుటుంబాలకు సహాయం అందించాలనే ఉద్దేశంతో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా(కిట్లు)పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. బూర్గంపాడు మండల కేంద్రంలోని యాసీన్ మసీదు వద్దతో పాటు సారపాకలోకి బసప్పక్యాంపు కాలనీలో ఈ కార్యక్రమం నిర్వహించి పేద కుటుంబాలకు రంజాన్ కిట్లు అందజేశారు. ఈసందర్భంగా జమాతే ఇస్లామీ హింద్(జేఐహెచ్)ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా మెరుగపడినవారు తమ సంపాదనలో 2.5శాతం జకాత్ రూపంలో తీసి నిరుపేదలకు సహాయం చేయడం ఇస్లాం మతంలో ఉన్న ముఖ్యమైన ఆచారమని తెలిపారు. అల్లాహ్ ఆదేశాల ప్రకారం జకాత్ ద్వారా పేదలకు చేయూత అందించడం ప్రతి ముస్లిం బాధ్యత అని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో రంజాన్ మాసంలో పేద కుటుంబాలకు రంజాన్ తోఫా అందించే కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరు తమ ఆదాయంలో 2.5శాతం జకాత్ రూపంలో చెల్లిస్తే సమాజంలో పేదరికాన్ని చాలా వరకు తగ్గించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. పేద కుటుంబాలు కూడా రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఉద్దేశంతో ఈ రంజాన్ కిట్లను అందజేస్తున్నామని తెలిపారు. ఈ రంజాన్ తోఫాలో దాదాపు 10రకాల నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈకార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు జహీర్ పాషా, అబ్దుల్ సలీం, సైదుద్దీన్, ఇర్షాద్, ఇమ్రాన్, షహబాజ్ పాల్గొన్నారు. అలాగే బూర్గంపాడు, సారపాక గ్రామ పెద్దలు షేక్ దస్తగీర్, మహమ్మద్ అబ్దుల్ జబ్బర్, సయ్యద్ ఉమర్ హుస్సేన్, నవాబ్ జాని, వలి భాష, బషరత్, నాగూర్ వలి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వైద్యులు సామినేని రాఘవయ్య మృతి

**-సంతాపం తెలిపిన సిపిఐ**



ప్రజాపక్షం/కారేపల్లి: నిస్వార్థపరుడు ప్రజా వైద్యులు సామినేని రాఘవయ్య మృతి చెందారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు తీరని లోటని సిపిఐ మండల కార్యదర్శి పాపినేని సత్యనారాయణ అన్నారు. కారేపల్లి మండల కేంద్రంలో ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తూ వైద్య వృత్తితో పాటు సామాజిక కార్యక్రమాలు చేసే గొప్ప వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రజా వైద్యుడిగా కార్పొరేట్ వైద్యాన్ని అతి తక్కువ ఫీజుతో అందించాడన్నారు. పేద విద్యార్థులను చదివిస్తూ గొప్ప వ్యక్తిత్వం కలవాడని అన్నారు. ఆయన మరణం పేద ప్రజలకు తీకని లోటు అని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని భారత కమ్యూనిస్టు పార్టీ తెలియజేస్తుందన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ నాయకులు అమీర్ జానీ, పోతనబోయిన రవి, సహదేవ్, తదితరులు ఉన్నారు.

## ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



ప్రజాపక్షం/కారేపల్లి: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం కారేపల్లి జామే మస్జిద్లో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైరా నియోజకవర్గ ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ హాజరై, ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి కృష్ణయ్య, సింగరేణి మండల కాంగ్రెస్ అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, స్థానిక సర్పంచ్ మేదరి వీరప్రతాప్(టోనీ), కారేపల్లి ఎస్ఐ గోపి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల, మస్జిద్ కమిటీ అధ్యక్షులు షేక్ మునీరుద్దీన్, ఉపాధ్యక్షులు సాఫి, మైనార్టీ అధ్యక్షులు తాజుద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యులు హనీఫ్, మజీద్ పాషా(షేరు), యాకుబ్ అలీ, శంషుద్దీన్, సర్దార్, షేక్ అబ్దుల్ మతీన్, యాకుబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి కలిసిన విద్యుత్ ఏడీఏ



ప్రజాపక్షం/కూసుమంచి: గత కొన్ని సంవత్సరాలుగా కూసుమంచి మండలంలో విద్యుత్ శాఖలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఏడీఏ)గా ప్రజలకు సేవలందించిన కోక్య నాయక్ బదిలీపై ఎదులాపురం మున్సిపాలిటీకి నియమితులైన సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఖమ్మం క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబూరి దయాకర్రెడ్డి కోక్యనాయక్ను సాదరంగా స్వాగతిస్తూ బదిలీపై ఎదులాపురం మున్సిపాలిటీలో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రమేష్, ఆత్మ కమిటీ ఛైర్మన్ చావా శివరామకృష్ణ, కూసుమంచి మండల మాజీ ఎంపీటీసీలు బానోత్ శ్రీనివాస్ నాయక్, జూకూరి గోపాల్రావు, తిరుమలయపాలెం మండల మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్, మాజీ సర్పంచ్ దాట్ల పరుశురాం పాల్గొన్నారు.

## ఆదివాసీలకు బెడ్ షీట్స్ పంపిణీ



ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా పర్చేజ్ డిపార్ట్మెంట్ అధికారి కె సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో కూనవరం పంచాయతీ పరిధిలోని సర్వాయి గుంపు ఆదివాసి కుటుంబాలకు ఆదివారం బెడ్ షీట్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి కూనవరం సర్పంచ్ ఏనిక శ్వేత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమ దాతకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లాలకు బిస్కెట్లు అందజేశారు. సింగరేణి సేవా సమితి సభ్యులు యస్ డి నా సర్ పాషా కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించగా ఏ మంగీలాల్, గ్రామ పెద్ద చుక్కయ్య, దేవి తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చయ్య త్యాగం చిరస్మరణీయం



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పుసులూరి బుచ్చయ్య త్యాగం ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య అన్నారు. ఆదివారం తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడు గ్రామంలో బుచ్చయ్య 15వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వాముల దోపిడీ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన గొప్ప పోరాటమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుసులూరి నరేందర్, పుసులూరి పుల్లయ్య, పుసులూరి మంజుల గిరి ప్రసాద్, బందెల వెంకయ్య, రేపాకుల శివలింగం, నాగేశ్వరరావు, హనుమంతరావు, గొడుగు విజయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# శిలాఫలకం బోర్డు లేకుండానే రోడ్డు పనులు ప్రారంభం

**-పంచాయితీ రాజ్ ఏఈ అఖిల్ నిర్లక్ష్యం**
**-స్థానికుల ఆగ్రహం**



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని చెగోమ్మ గ్రామం నుండి పోచారం ఆర్అండ్‌బి రోడ్డు వరకు పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం వారి నిర్వహణలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు శిలాఫలకం బోర్డు ఏర్పాటు చేయకుండా ప్రారంభించడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలు, ఖర్చు, పనుల కాలపరిమితి వంటి సమాచారం శిలాఫలకం బోర్డు ద్వారా ప్రజలకు తెలియజేయడం ఆనవాయితీ. అయితే ఈ నిబంధనలను పట్టించుకోకుండా రోడ్డు పనులను ప్రారంభించడం వివాదాస్పదంగా మారింది. పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ రోడ్డు పనులకు శిలాఫలకం బోర్డు ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని సూచిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పంచాయితీ రాజ్ శాఖ ఏఈ అఖిల్ ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి వివరాలు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గ్రామస్తులు అంటున్నారు. శిలాఫలకం లేకుండా పనులు ప్రారంభించడం వల్ల ఖర్చు వివరాలు, పనుల గడువు వంటి విషయాలు ప్రజలకు తెలియకుండా పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి శిలాఫలకం బోర్డు ఏర్పాటు చేసి, పనుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**పిఆర్ఏఈ అఖిల్ వివరణ.....**

రోడ్డు పనుల శిలాఫలకంపై కూసుమంచి మండల పిఆర్ఏఈ అఖిల్‌ను వివరణ కోరగా అలా శిలాఫలకం బోర్డు పెట్టాలని రూల్ ఏమి లేదు. పనులు పూర్తయిన తర్వాత మేమే పెడతాము. అంతే కానీ కచ్చితంగా పెట్టాలనే రూలేమీ లేదు, రోడ్డు అయిన తర్వాత పెడతాము అని తెలిపారు. మరి రోడ్డు పనులకు సంబంధించిన నిధులు, రోడ్డు దూరం వివరాలను అడుగగా నా దగ్గర లేదు చేసుకున్న తర్వాత తెలుపుతానని అన్నారు.

# పద్మాపురం పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులకు శ్రీకారం

**పాల్గొని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం**



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం పద్మాపురం గ్రామంలో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించబోయే గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రారంభించారు. గ్రామపంచాయతీ నూతన భవనం నిర్మాణం పూర్తయ్యిన తర్వాత గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు గ్రామ అభివృద్ధికి దోహదపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచ్ పోలెబోయిన శ్రీవాణి తిరుపతయ్య, మండల నాయకులు ఎర్ర సురేష్, పద్మాపురం సర్పంచ్ తోలెం రమేష్, ఉపసర్పంచ్ పఠాన్ యాకూబ్, కరకగూడెం సర్పంచ్ పోలెబోయిన సుజాత, రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, మహిళలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా చెల్లించాలని సంతకాల సేకరణ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్రంలో రైతాంగం వ్యతిరేక ప్రభుత్వం పాలన సాగిస్తుందని బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. మండలం లోని వివిధ గ్రామాలలో ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమం ను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వెంటనే రైతు భరోసా అందించాలని కోరారు. రైతాంగం సమస్యల ను పరిష్కరించే వరకు పార్టీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన లు చేపడతామని పేర్కొన్నారు. అందులో భాగంగానే రైతుల సంతకాల సేకరణ ఉద్యమం ను చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం కు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ప్రధాన మంత్రి ఫసల్ భీమాపంటల పథకం ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బాజా రామకృష్ణ, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పుట్టా సత్యనారాయణ, పిట్టల సూరిబాబు, తంగేళ్ల సతీష్, కొండా హర్షవర్ధన్, సురేష్, కందరబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నామ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మాజీ ఎంపి నామ నాగేశ్వర రావు జన్మదిన వేడుకలను ఎర్రుపాలెం మండల కేంద్రం లోని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ జెడ్పిటిసి శీలం కవిత ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కవిత మాట్లాడుతూ నామ నాగేశ్వరరావు జిల్లాను ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. అనంతరం ఎర్రుపాలెంలోని కరుణ వృద్ధాశ్రమం నందు వృద్ధులకు పాలు, పండ్లు అందించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, సంక్రాంతి కృష్ణారావు, కుడుముల మల్లికార్జున్‌రెడ్డి, బొర్రా నర్సింహారావు, గద్దల శ్రీనివాసరావు, నల్లపు అశోక్, రావూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నామ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ మాజీ లోక్ సభాపక్ష నేత నామ నాగేశ్వరరావు జన్మదినం వేడుకలను మధిరలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నామ జన్మదిన కేక్‌ను మాజీ జెడ్పిచైర్మన్ లింగాల కమల్‌రాజు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నామకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ పట్టణ, రూరల్ కమిటీ నాయకులు మధిర మెయిన్‌రోడ్డు నందు ఉన్న వినాయకుని గుడిలో నామ నాగేశ్వరరావు పేరున ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పల్లపోతు వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, బిక్కి కృష్ణప్రసాద్, వార్డు కౌన్సిలర్ యన్నం అప్పారావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, వంకాయలపాటి నాగేశ్వరరావు, కోతారి రాఘవరావు, ధీరావత్ మాధవి, ముత్తవరపు ప్యారీ, ఆళ్ల నాగబాబు, పరిస శ్రీనివాసరావు, చీదిరాల రాంబాబు, అబ్దుల్ ఖురేషి, పెద్దపూడి సుధాకర్, దోర్నాల శ్రీనివాసరావు, మల్లెల లింగయ్య, శీలం శివ, కర్నాటి శశి పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడకు చెందిన షేక్. అహ్మద్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఆదివారం రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. అహ్మద్ సతీమణి బీజాన్‌బీ కుటుంబసభ్యులు షేక్.అక్బర్, జానిపాషా చేతుల మీదుగా రంజాన్ తోఫాను అందించారు. తల్లాడ, నారాయణపురం, మల్లవరం, కొడవటిమెట్ట, ఎన్టీఆర్‌నగర్, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఈ తోఫాను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది అహ్మద్ జ్ఞాపకార్థం ఖమ్మంలో నివాసం ఉంటున్న ప్రముఖ వ్యాపారవేత్త షేక్.ఖదీర్‌పాషా ఆధ్వర్యంలో తల్లాడ మండలం ముస్లింలందరికీ తోఫా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పండుగను ప్రతిఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు షేక్.అక్బర్, మస్తాన్, షేక్. ఈసూఫ్, ఎండి.బహదూర్, అన్వర్ పాషా, కమల్‌పాషా, మౌలాలి, నాగుల్‌మీరా, ముస్తాఫా, చిన్నా సైదులు, సిలార్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ మండలంలో నందమూరి సుహాసిని పర్యటన



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు కుమార్తె నందమూరి సుహాసిని ఆదివారం పర్యటించారు. ఖమ్మం జిల్లాలోని వేంసూరు మండలం లచ్చన్నగూడెంలో స్వర్గీయ నందమూరి తారక రామరావు కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. దీనిలో భాగంగా తల్లాడ మండలంలోని తెలుగుదేశం మండల అధ్యక్షులు సరికొండ శ్రీనివాసరాజు ఇంటి వద్ద తేనేటి విందులో పాల్గొన్నారు. అంతకుముందు ఆమెకు అభిమానులు పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి నాయకుడు కేతినేని హరీష్, మాజీ ఎఎంసి వైస్‌చైర్మన్ ధుపాటి భద్రరాజు, కూచిపూడి వెంకటేశ్వరరావు, దుగ్గినేని వెంకటేశ్వర్లు, నారపోగు ప్రసాద్, కొమ్మినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీల అభివృద్ధిలో సిబ్బంది కీలకపాత్ర




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పంచాయతీల అభివృద్ధి లో సిబ్బంది పాత్ర కీలకమని రాజేశ్వరపురం సర్పంచ్ దండా రంగయ్య పేర్కొన్నారు. మండలం లోని రాజేశ్వరపురం లో ప్రజాపాలన..ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఆదివారం సిబ్బంది ని ఘనంగా సన్మానించారు. శానిటేషన్ కిట్స్ ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీలో ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారంటే సిబ్బంది యెక్క కృషి అన్నారు. తెల్లవారు జామునుంచి రాత్రి వరకు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్నారని అన్నారు. సిబ్బంది ఆరోగ్యం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోనే ఆదర్శ పంచాయతీగా ఉండేందుకు సిబ్బంది శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉప సర్పంచ్ రాసాల నవీన్, వార్డు సభ్యులు చలవాది రామారావు, దండా నరసింహారావు, యలమద్ది లెనిన్, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలి



**ప్రజాపక్షం/ మధిర :** ముస్లింల పవిత్ర మాసమైన రంజాన్ పర్వదినాన్ని ముస్లింలందరూ సంతోషంగా జరుపుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ కోన ధనికుమార్ ఆకాంక్షించారు. ఆదివారం రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ముస్లిం కుటుంబాలకు అందిస్తున్న రంజాన్ తోఫాను 18వ వార్డు పేద ముస్లిం కుటుంబాలకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్ర మాసం అన్నారు. రంజాన్ పండుగను పేద కుటుంబాలు సైతం సంతోషంగా జరుపుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మధిరలో ప్రతి ఇంటికి రంజాన్ తోఫా కిట్టు పంపించారని అన్నారు. ముస్లిం సోదరసోదరీమణులకు ముందుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, మైనార్టీ కౌన్సిలర్ షేక్.రషీదున్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్.జహంగీర్ , మిరియాల కాశీవిశ్వేశ్వరరావు, బాహటం వనజ, షేక్.సాజీదా, బొడ్డు నాగేశ్వరరావు, నల్లబోతుల శ్రీను, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# సంతోష్‌ను సన్మానించిన కుటుంబ సభ్యులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా నియమితులైన తర్వాత కట్ల సంతోష్‌ను చెల్లెలు ఆది శ్రావణి, సంతోష్ భార్య కట్ల కల్పన కుటుంబ సభ్యులు కాకిత శ్రీలక్ష్మి, కట్ల అరుంధతి, కట్ల అనిల్‌కుమార్, కట్ల సునీల్ ఆదివారం సంతోష్ నివాసంలో కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కుటుంబ సభ్యుల నుండి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కట్ల సంతోష్ బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషాన్ని కలిగించింది అన్నారు.

# సంగీత సాగరం

**- అలరించిన నాదోపాసన**
**- నదీమ తల్లికి హారతి**



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీసీతారామ చంద్రస్వామివారి పుణ్యక్షేత్రం సంగీత సాగరంగా మారింది. గోదావరి తీరంలో ఆదివారం సాయంత్రపు వేళ నిర్వహించిన నాదోపాసన భక్తి సంగీత విభావరి ఆద్యాంతం అలరించింది. నదుల విశిష్టతను తెలియజేసే కార్యక్రమంలో భాగంగా గత కొంతకాలంగా నిర్వహిస్తున్న గోదావరి నదీహారతి ఈ ఆదివారం కొత్తరూపాన్ని సంతరించుకుంది. హైదరాబాద్‌కు చెందిన శ్రీ వాగ్దేవి కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నాదోపాసన సంగీత వేడుక గోదావరి అలలతోనే సరిగమనలు పలికించింది. షణ్ముఖ ప్రియ, హరిప్రియ సోదరీ మణులు గాత్రస్తోత్రంతో భక్తులు రామనామ స్మరణలో మునిగితేలారు. గోదావరిఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకటరావు దంపతులతో పాటు, సర్పంచ్ పూనెం కృష్ణ దొర జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సింధుజా రామనామ సంకీర్తలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం గోదావరి మాతకు పంచ హారతులు భక్తిశ్రద్ధలతో పట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేద మంత్రోశ్చరణల నడుమ గోదావరి మాతకు ప్రత్యేక హారతి సమర్పించారు. దీప దూప కాంతులతో నదీతీరం పున్నం కాంతులను సంతరించుకుంది. భక్తులు హారతి దర్శనం చేసి నదీమతల్లికి నమస్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ గోదావరి నది భారత సంసృ్కతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. పెద్దఎత్తున భక్తులు, సంగీత ప్రియులు హాజరు కావడంతో గోదావరి తీరం పులకించింది. ఈ వేడుకలో తహశిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, దేవస్థానం ఇఓ దామోదర్ రావు, పుర ప్రముఖులు పాకల దుర్గాప్రసాద్, రజనీ టాప్ రాము, కడాలి నాగరాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# సిఆర్‌పి బుమన్న మృతిపై యూనియన్ తెలంగాణ నివాళి

**-సమస్యలపై ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావుతో భేటీ**





**ప్రజాపక్షం/చండ్రుగొండ:** సిఆర్‌పి యూనియన్ తెలంగాణ పక్షాన మిత్రుడు బుమన్న మరణంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 2012లో కలిసి ఉద్యోగంలో చేరిన సహచరుడు నేడు మన మధ్య లేకపోవడం బాధాకరమని యూనియన్ సభ్యులు తెలిపారు. సిఆర్‌పిల సమస్యల పరిష్కారం కోసం సియూటి ద్వారా ఏఐటియూసితో కలిసి పోరాటం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సిఆర్‌పి యూనియన్ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావును, సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషాను సియూటి రాష్ట్ర అధ్యక్షులు పాద్య నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సేవ్య నాయక్ కలిసి సమస్యలపై చర్చించారు. సిఆర్‌పిల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తామని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. సంఘం బలోపేతానికి సభ్యత్వ నమోదు అవసరమని, సభ్యులు సహకరించాలని యూనియన్ నాయకులు కోరారు. అలాగే సిఆర్‌పి యూనియన్ తెలంగాణ కమిటీని ముఖ్యమంత్రితో సమావేశం చేసే దిశగా ఏఐటియూసి రాష్ట్ర కార్యవర్గం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# పంచాయతీ సిబ్బందికి కాళ్లు కడిగి సత్కారం





**-ఎంఎల్‌ఏ జారె ఆదినారాయణ ప్రత్యేక గౌరవం**

**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలో పర్యటించిన ఎంఎల్‌ఏ జారె ఆదినారాయణ పంచాయితీ సిబ్బందికి ప్రత్యేక గౌరవం తెలిపారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ సిబ్బందికి ప్రభుత్వం అందిస్తున్న యూనిఫామ్‌లను పంపిణీ చేసిన అనంతరం వారి సేవలను గుర్తిస్తూ ఎంఎల్‌ఏ స్వయంగా వారి కాళ్లు కడిగి ఘనంగా సత్కరించారు. ఈ సంఘటన అక్కడ ఉన్న వారిని ఆకట్టుకుంది. అంతకు ముందు చాపరాలపల్లి గ్రామంలో ప్రైవేట్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఎంఎల్‌ఏ ప్రారంభించారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, ఇలాంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అదే గ్రామంలో పర్సా తిరుమలయ్య, నల్లమోతు సత్యం, అలాగే వికె రామవరం(కొత్తూరు)గ్రామంలో ఆంగోతు రోజా ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్బగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయితీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, బత్తుల అంజి, కారం సుధీర్, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# బహుజన హితమే కాన్షీరామ్ అభిమతం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బీసీ, ఎస్సీ, ఎస్టీల ఆరాధ్య దైవం కాన్షీరామ్ అని బుద్దిస్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు పెద్దపాక వెంకట్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని భైరవునిపల్లి గ్రామంలో బుద్ధిష్ట్ సొసైటీ ఆధ్వర్యంలో కాన్షీరామ్ 92వ జయంతి ఘనంగా నిర్వహించారు.తొలుత అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 15 శాతం ఉన్న అగ్రకులాలే దేశంలోని భూమి, సంపద, రాజకీయ అధికారులు అనుభవిస్తున్నారని మండిపడ్డారు. ఈ దేశంలోని ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన అంబేద్కర్ అడుగుజాడల్లో కాన్సిరాం ముందుకు సాగారని కొనియాడారు. బహుజనలకు ఓటు విలువ తెలిసేలా చేసి అభివృద్ధికి బాటలు వేసిన కాన్షిరం చిరస్మరనీయుడనీ అన్నారు. అంబేద్కర్ కు నిజమైన వారసుడు కాన్షీరాం అని తెలిపారు. ఓటు ద్వారా సమాజంలో మార్పు అధికారం సాధించవచ్చు అని నిరూపించారని కొనియాడారు. ఆయన బాటలో నడిస్తేనే బహుజనుల బతుకులు మారుతాయని, ఆ దిశగా ప్రయాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ జిల్లా నాయకులు పగిడి కత్తుల ఈదయ్యా, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మరికంటి రమేష్, గండు సైదులు సిపిఐ గ్రామ శాఖ సహాయ కార్యదర్శి బాలేబోయిన వేంకటేశ్వర్లు,సిపియం నాయకులు పెద్దపాక మల్లేశ్వరరావు, జానపద కళాకారుడు పెద్దపాక విజయ్ కుమార్, పెద్దపాక సైదులు, కుక్కల వెంకన్న గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# వెంకటలక్ష్మికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రం కు చెందిన సామాజిక కార్యకర్త గండికోట వెంకటలక్ష్మి తెలుగు బుక్ రికార్డులో చోటు దక్కించుకుంది. సనాతన ధర్మ ప్రచారం, ఆధ్యాత్మిక బోధన మరియు సామాజిక సేవా కార్యక్రమాలలో విశేష కృషి చేశారు. శ్రీ బాలా పరివారం ఆధ్వర్యంలో సౌందర్యలహారి లలితా సహస్రనామం విష్ణు సహాస్రనామం, లక్ష్మి సహస్రనామం, తిరుప్పావై వంటి గ్రంథాల బోధన ను ఆన్ లైన్, ఆఫై లైన్ ద్వారా విస్తృతంగా నిర్వహించారు. దేవాలయంలో నిత్యపారాయణ కార్యక్రమాలు నిర్వహించటం అలాగే మహిళా సాధికారత మరియు పేద విద్యార్థుల విద్య కు ప్రోత్సాహం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు వారి విశిష్ట ఆధ్యాత్మిక సేవలను పురష్కరించుకుని తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ఆధ్యాత్మిక విభాగంలో అధికారికంగా నమోదు చేసినట్లు తెలిపారు. గుర్తింపు పత్రం షీల్డ్ ను తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధి మధుసూదన్ రాజు అందించారు. ఈ సందర్భంగా ఆమె ను మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి తో పాటు పలువురు అభినందించారు.

# క్రికెట్ టీంకి దుస్తులు వితరణ



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల పరిధిలోని ముద్దాపురం గ్రామంలో రెండు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్న సందర్భంగా మండల పరిధిలోని మర్కోడు గ్రామానికి చెందిన జిలకర శ్రావణ్ తాపీ మేస్త్రీ ఆళ్లపల్లి పోలీస్ టీంకు క్రికెట్ దుస్తులు టీ షర్ట్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా స్థానిక ఎస్ఐ సోమేశ్వర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీర ధృఢత్వానికి, స్నేహ సంబంధాలు మెరుగు పరుస్తాయని ఆటలు ఆడటం వలన ఎంత ఉత్సాహంగా ఉంటుందని, యువత చెడు దారిలో వెళ్లకుండా క్రీడలలో ఉత్సాహంగా పాల్గొనాలని వారన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ యువజన నాయకులు భరత్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకంఠమహేశ్వర స్వామి సురమాంబ దేవతలకు జలాభిషేకం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల కేంద్రంలోని గౌడ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీకంఠమహేశ్వర స్వామి సురమాంబ కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం శ్రీ కంఠమహేశ్వర స్వామికి సురమాంబ దేవికి గౌడ కులస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా బయలుదేరి గ్రామ పోలిమెరలోని ఎల్లమ్మ ఆలయంలో కొలువుదీరిన శ్రీ కంఠమహేశ్వర స్వామి సురమాంబ అమ్మవార్లకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కుల పెద్దలు మాట్లాడుతూ శ్రీ కంఠమేశ్వర స్వామి సురమాంబ దేవి కళ్యాణాన్ని పురస్కరించుకొని ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా మూడువ రోజు స్వామివారికి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించడం జరిగిందని అన్నారు. సోమవారం స్వామి వారి కళ్యాణ ఉంటుందని అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమం అంతా గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని గౌడ కుల చరిత్ర అందరికీ తెలిసేలా బుర్రకథ కళాకారుల ద్వారా ప్రదర్శించడం జరుగుతుందని ఈసందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో గౌడ కుల పెద్ద శ్రీరామ్ సమ్మయ్య, ఆలయ కమిటీ ఛైర మన్ కోరుకొప్పుల రాజన్న, సారకల్లు గౌడ్, పానుగంటి వెంకటేశ్వర్లు, గౌడ కులస్తులు రేసు ఎల్లయ్య, దీకొండ మల్లేష్, సూరిబాబు, పురుషోత్తం, తెలగాని శ్రీను, మంద సాయి, రేసు రాము, సంపత్, సతీష్, సాయన్న వెంకటేశ్వర్లు, నరసింహారావు, తిరుపతి రాజు, నరేష్, రాసారు సాయి, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

# లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం

**-ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, అధికారులకు సన్మానం**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** కోయగూడెం గ్రామ పంచాయితీ ఎస్టీ కాలనీలో గత కొంతకాలంగా నెలకొన్న లోవోల్టేజ్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గ్రామ సర్పంచ్ కుంజా కొండమ్మ దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించారు. ఈసందర్భంగా కుంజా కొండమ్మ, ఉప సర్పంచ్ సున్నం కృష్ణవేణి, విద్యుత్ శాఖ ఏఈ ఉపేందర్, లైన్మెన్ శ్రీనివాస్, హనుమంత్‌లకు శాలువా కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు బొర్రా రమేష్, సోడే సునీత, సున్నం వెంకటలక్ష్మి, గ్రామ పెద్దలు మడకం రామయ్య, సున్నం పోతయ్య, సున్నం మోహన్‌రావు, కొండలరావు, శంకర్, శ్రీను, రంజిత్, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-కన్వీనర్ గా శ్రీనివాస్

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోకన్వీనర్ గా నేలకొండపల్లి కి చెందిన పసుమర్తి శ్రీనివాస్ ని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కుంటున్న పలు సమస్యల పై క్షేత్ర స్థాయిలో పోరాటాలు చేపట్టనున్నట్లు తెలిపారు. వెలుగుమట్ల బాధితుల కోసం కోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. తన పై నమ్మకంతో జిల్లా కోకన్వీనర్ గా నియమించినందుకు కేంద్ర, రాష్ట్ర, జిల్లా కమిటికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.